క్లుప్తంగా

గ్రామాల అభివృద్ధికి పెద్దపీట



నిజాంసాగర్(జుక్కల్): ప్రజాపాలన సంక్షేమ పథకాల అమలు, గ్రామాల అభ్యున్నతికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి అన్నారు. ఆదివారం మహమ్మద్‌నగర్ మండలంలోని నర్వ గ్రామంలో సిమెంట్ రోడ్డు పనులను కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు మాట్లాడుతూ ప్రతీ గ్రామానికి సిమెంట్ రోడ్లు, మురికి కాలువల నిర్మాణానికి నిధులు కేటాయించడంతో ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు కృషి చేస్తున్నారన్నారు. మండల కాంగ్రెస్ నాయకులు జయప్రదీప్, రమేశ్ యాదవ్, మల్లయ్యగారి ఆకాష్, లోక్యనాయక్ , నర్సింలు, భూమాగౌడ్ తదితరులున్నారు.

వివాహ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే



లింగంపేట(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని స్థానిక జీఎస్ఆర్ గార్డెన్‌లో ఆదివారం మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ వివాహ వేడుకల్లో పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. మండలంలోని శెట్పల్లి గ్రామానికి చెందిన నాయికోటి సత్యనారాయణ మాజీ ఎమ్మెల్యే ప్రధాన అనుచరుడు, బీఆర్ఎస్ నాయకుడు కూతురు వివాహానికి హాజరయ్యారు. అలాగే బీజేపీ నాయకుడు వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి, నాయకులు తదితరులున్నారు.

వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ కమిటీ ఎన్నిక



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ గ్రామ కమిటీని నూతనంగా ఎన్నుకున్నట్లు వీహెచ్‌పీ జిల్లా సహ సంయోగ్ వినోద్ అన్నారు. ఆదివారం గ్రామ కమిటీని ఎన్నుకున్నామన్నారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా చిమ్మ సత్యనారాయణ, కార్యదర్శిగా నాగరాజులను ఎన్నుకున్నట్లు వారు తెలిపారు.

విద్యార్థికి చేయూత



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని అయ్యపల్లితండాకు చెందిన మునావత్ స్వర్ణ గిరిజన వైద్య విద్యార్థిని నల్గొండలో ఎంబీబీఎస్ ఫోర్త్ ఇయర్ చదువుతోంది. ఆమె ఆర్థిక పరిస్థితి సరిగా లేనందున బిగ్ హెల్పింగ్ బ్రిడ్జి ఫర్ ఎడ్యుకేషన్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ఆదివారం ఆర్థికసాయం అందజేశారు. ప్రతిభ ఉన్న విద్యార్థి చదువు మధ్యలో ఆగకుండా తమ వంతుగా రూ. 20 వేలు విద్యార్థి తండ్రికి అందజేశారు. సంస్థ ప్రతినిధులు కృష్ణాకర్ రావు, తోట సాయిలు, రజినీకాంత్‌గౌడ్, సంతోష్‌కుమార్, దీక్షిత్‌గౌడ్, సత్యనారాయణ, నవీన్ తదితరులున్నారు.

ఎన్విరాన్‌మెంట్ పరీక్షకు హాజరు కావాలి

లింగంపేట(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న ఫస్టియర్ విద్యార్థులు ఎన్విరాన్‌మెంట్ ఎడ్యుకేషన్ ఎగ్జామినేషన్ (పర్యావరణ పరిరక్షణ పరీక్ష)కు హాజరుకావాలని కళాశాల ప్రిన్సిపాల్ నరేందర్ ఆదివారం ఆయన ఒక ప్రకటనలో సూచించారు. ఇంటర్ బోర్డు టైంటేబుల్ ప్రకారం సోమవారం ఉదయం 9 గంటలకు పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ఫస్టియర్ విద్యార్థులు ఉదయం 9 గంటల్లోపు తమ రికార్డులు, హాల్‌టికెట్‌తో పరీక్షకు హాజరుకావాలని సూచించారు.

ఎస్సెస్సీ ప్రతిభా పరీక్ష సక్సెస్



కామారెడ్డి టౌన్ : ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని సాందీపని జూనియర్ కళాశాలలో ఆదివారం పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన ప్రతిభా పరీక్ష విజయవంతమైంది. ఎంఈవో ఎల్లయ్య, కామారెడ్డి పట్టణ ఎస్సై అనిల్, సీఐటీయూ జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్, సాందీపని విద్యా సంస్థల డైరెక్టర్ రాజేశ్వర రావు ముఖ్య అతిథిగా హాజరై పరీక్ష ప్రశ్న పత్రాలను ఆవిష్కరించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అరుణ్, అజయ్, కళాశాల ప్రిన్సిపల్ సాయిబాబా, రాజశేఖర్, నాయకులు సంతోష్, నితిన్, సమీర్ తదితరులున్నారు.

నిఘా నేత్రాల నిర్వహణపై నిర్లక్ష్యం

- పలు గ్రామాల్లో పనిచేయని సీసీ కెమెరాలు
- రూ. వేలు ఖర్చు పెట్టినా నిరుపయోగం
- నిర్వహణ లేక మూలకు పడ్డ వైనం



ఆర్గొండ గ్రామంలో పనిచేయని సీసీ కెమెరా

రాజంపేట : జిల్లాలోని ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటుకు సన్నాహాలు చేపట్టి గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు పునాది వేసింది. ఆరంభంలో ప్రతి గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేసినప్పటికీ వాటి నిర్వహణలో కాస్త జాప్యం ఏర్పడింది. దీంతో పలు గ్రామాల్లో సీసీ కెమెరాలు మూలకుపడ్డాయి. రూ.లక్షల వెచ్చించి గ్రామీణ ప్రాంతలల్లో పాటు మండల కేంద్రాలల్లో స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులు సహకారంతో సీసీ కెమెరాలను బిగించినప్పటి వాటి నిర్వహణ లేక మూలకు పడిపోయాయి. రాజంపేట మండల కేంద్రంతో పాటు బస్వన్నపల్లి, ఆర్గొండ తదితర గ్రామాల్లో సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. గతంలో దాతలు, స్థానిక ప్రజాప్రతిధులు, ప్రజల సహకారంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినప్పటికి నిర్వహణ లేక మరుగునపడ్డాయి.

చాలా మండలాల్లో..

జిల్లాలోని చాలా మండలాల్లోని గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినప్పటికీ వాటి నిర్వహణ లేకపోవడంతో చాలా చోట్ల కెమెరాలు పనిచేయడం లేదు. దాతల సాయంతో ఏర్పాటు చేసుకున్న ఈ సీసీ కెమెరాలు నిర్వహణ బాధ్యత ఎవరు తీసుకోవాలనే ప్రశ్న ప్రతి గ్రామంలో తలెత్తింది. ఇటీవల జిల్లా కేంద్రంతో పాటు చాలా మండలాల్లో బైక్ చోరీలు, ఇళ్లలో చోరీ ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. సీసీ కెమెరాలు పనిచేస్తేనే ఇలాంటి సంఘటనలు అడ్డుకోడానికి ఆస్కారముంది. పోలీసు యంత్రాంగం కూడా నిందితులను త్వరగా పట్టుకుని శిక్షించే వీలు కల్గుతుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ చూపి గ్రామాల్లో సీసీ కెమెరాలను వాడుకలోకి తీసుకురావాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వెలవెలబోతున్న ఆటోలు



తాడ్వాయి మండల కేంద్రంలో ఆటోలు

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : రాష్ట్రప్రభుత్వం ఆర్టీసీలోఏ 'మహాలక్ష్మి' పథకాన్ని ప్రవేశ పెట్టడంతో ప్యాసింజర్ ఆటోలు వెలవెలబోతున్నాయి. ప్రతిరోజు తాడ్వాయి మండలానికి చెందిన సుమారు 250 ప్యాసింజర్ ఆటోలు నడుస్తున్నాయి. మహిళలు ఉచి తంగా ప్రయాణించేందుకు ఆర్టీసీ బస్సులను వేయడంతో ఆటోల్లో మహిళలు ఎక్కడం లేదు. మహిళలతో పాటు పురుషులు కూడా బస్సుల్లోనే ప్రయాణిస్తున్నారు. ఆటోలపై ఆధార పడ్డవారు తమ కుటుంబాలను పోషించుకోవాలంటే అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఆదివారం వస్తే మా పరిస్థితి మారీ అధ్వానంగా మారిందని వారు వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి తమకు దారి చూపాలని కోరుతున్నారు.

వృద్ధులను గౌరవించాలి



న్యాయవాది రాంరెడ్డిని సన్మానిస్తున్న సభ్యులు

భిక్కనూరు : ప్రతి ఒక్కరూ వృద్ధులను గౌరవించాలని హైకోర్టు న్యాయవాది పెద్దబచ్చగారి రాంరెడ్డి అన్నారు. ఆదివారం ఆయన భిక్కనూరు మండలం రామేశ్వర్‌పల్లిలోని వృద్ధుల సంఘం భవన నిర్మాణానికి రూ. 3లక్షలు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా రాంరెడ్డిని వృద్ధుల సంఘం తరపున ఘనంగా సన్మానించారు. వృద్ధుల ఐకమత్యంతో ఉండి ఎవరికైన వారి పిల్లలు ఇబ్బందులకు గురి చేస్తే వారిని ప్రభుత్వంచేత శిక్షింపజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వృద్ధుల సంఘం అధ్యక్షుడు మద్ది చిన్న రాజిరెడ్డి, గౌరవ అధ్యక్షుడు ఎడ్ల రాజిరెడ్డి, కోశాధికారి నాగార్తి లక్ష్మారెడ్డి, ప్రతినిధులు జగ్గన్నగారి ప్రతాప్‌రెడ్డి, తక్కళ్ల రాజిరెడ్డి, జగ్గారెడ్డి, మోహన్‌రెడ్డి, బుచ్చిబాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విరగబూసిన మోదుగ పువ్వు



నిజాంసాగర్ ప్రాజెక్ట్‌కు వెళ్లే రోడ్డులో విరగబూసిన మోదుగ పువ్వులు

నిజాంసాగర్(జుక్కల్) : నిజాంసాగర్ ప్రాజెక్ట్ మార్గంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న మోదుగ చెట్లు విరగబూసాయి. ఎర్రటి రంగులో పువ్వులతో ఆకర్షణీయంగా కనిపిస్తుండడంతో ప్రాజెక్ట్‌కు వచ్చే పర్యాటకులకు కనివిందు చేస్తున్నాయి. కాముడి పౌర్ణమి సమీపిస్తుండటంతో అటవీ ప్రాంతాల్లోని మోదుగ చెట్లు పువ్వులతో కొత్తకళను సంతరించుకుంటున్నాయి.

నిధులున్నా నిలిచిన పనులు



పాఠశాలకు గేట్లు లేకపోవడంతో అడ్డుపెట్టిన చెట్టు కొమ్మలు

- స్కూల్ గేట్‌కు అడ్డుగా చెట్ల కొమ్మలు
- పశువులు రాకుండా చర్యలు

నస్రుల్లాబాద్(బాన్సువాడ) : నిధులున్నా కూడా పనులు నిలిచిపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. నస్రుల్లాబాద్ మండల కేంద్రంలో ఉన్న గిరిజన గురుకుల పాఠశాలకు ప్రహరీ నిర్మాణం కోసం రూ. 20 లక్షల మంజూరు చేశారు. అయితే గుత్తేదారు ప్రహరి నిర్మించి గేట్లు ఏర్పాటు చేయకుండా వదిలేశారు. గేట్లు, రంగులు, వాచ్‌మెన్ గది నిర్మాణం కోసం మరో రూ. 8 లక్షలు అగ్రిమెంట్ కూడా పూర్తయ్యింది. కాని గుత్తేదారులు ముందుకు రాక పోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. గేట్లు లేకపోవడంతో చెట్టు కొమ్మలను అడ్డు పెట్టుకుంటున్నారు. ప్రాంగణంలో పశువులు పందులు తిరుగుతూ ఉండగా వాటి మధ్యే విద్యార్థులు భోజనం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి గేట్లు, రంగులు ఏర్పాటు చేయాలని విద్యార్థులు, అధ్యాపకులు కోరుతున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ గిరిజన గురుకుల బాలుర పాఠశాల గేట్లు ఏర్పాటు లేక ఇబ్బందిగా మారిందన్నారు. నిధులున్నాయని స్థానిక నాయకులు స్పందించి పనులు పూర్తయ్యేలా చూడాలని ఆయన కోరారు.

డీఎస్పీకి సన్మానం



బాన్సువాడ : బాన్సువాడకు కొత్తగా వచ్చిన డీఎస్పీ సత్యనారాయణను ఆదివారం ఏఎస్ఆర్ ఫౌండేషన్ సభ్యులు కలిసిన పుష్పగుచ్ఛం అందజేశారు. ఏఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవ కార్యక్రమాల గురించి అడిగి తెలుసుకున్నారు. సేవ కార్యక్రమాలకు సహకరిస్తానని డీఎస్పీ అన్నారు. డీఎస్పీని ఫౌండేషన్ వ్యవస్థాపకులు అయ్యాల సంతోష్, సాయికుమార్, విజయ్, సాయిలు ఉన్నారు.

దోమల నివారణకు ఫాగింగ్



భిక్కనూరు : మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామంలో దోమల నివారణకు మందును ఫాగింగ్ చేశారు. ఆదివారం రాత్రి గ్రామంలోని అన్ని వీధుల్లో ఫాగింగ్ యంత్రం ద్వారా మందును వదిలారు. ఈ కార్యక్రమంలో ఈవో లక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు సాయగౌడ్, రాములు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

సమాచారం..

నేడు ఎల్లారెడ్డిలో ప్రజావేదిక

ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో సోమవారం ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ మాధవి అధ్యక్షతన ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించామన్నారు. గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా 2022–2023 ఏడాదికి చేపట్టిన పనులకు సంబంధించిన సామాజిక తనిఖీల్లో భాగంగా గ్రామాల్లో గ్రామ సభ పూర్తయిందన్నారు. మండల ప్రజావేదిక సోమవారం ఉదయం 11గంటలకుప్రారంభమవుతుందన్నారు.

నేడు సద్గురు మహదేవ్ స్వామి రాక

బాన్సువాడ : బీర్కూర్ మండలం బరంగెడ్గి గ్రామానికి సోమవారం గుడిమేట్ మహరాజ్ సద్గురు మహదేవ్ స్వామి రానున్నట్లు ఛత్రపతి శివాజీ సేన నాయకులు తెలిపారు. గ్రామంలోని దాబాబంగ్లా వద్ద ఛత్రపతి శివాజీ విగ్రహ ఏర్పాటుకు స్వామి భూమి పూజ చేస్తారన్నారు. బైక్‌ర్యాలీ ఉంటుందని గ్రామస్తులు పాల్గొనాలన్నారు.

నేడు భిక్కనూరులో విద్యుత్ అంతరాయం

భిక్కనూరు : మండలకేంద్రంలో ఈనెల 19వ తేదీ సోమవారం ఉదయం 8.30గంటల నుంచి 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ సంకీర్తన ఆదివారం తెలిపారు. విద్యుత్ తీగల మరమ్మతులు జరుగుతున్నాయన్నారు.

నేడు శివాజీ విగ్రహం ఆవిష్కరణ

లింగంపేట(ఎల్లారెడ్డి) : మండలంలోని అయిలాపూర్‌లో సోమవారం ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా విగ్రహం ఆవిష్కరించనున్నట్లు శివాజీ యూత్ కమిటీ సభ్యులు తెలిపారు. సాయంత్రం ఆరు గంటలకు ప్రముఖ శాస్త్రవేత్త పైడి ఎల్లారెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. సాయంత్రం 4 గంటలకు గ్రామంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తామన్నారు.

నిజాంసాగర్ మండలంలోని మాగిలో..

నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని మాగిలో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని సోమవారం ఉదయం 11 గంటలకు ప్రారంభిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు. జుక్కల్ పీఠాధీశులు గోపాల్ మహరాజ్ చేతుల మీదుగా విగ్రహావిష్కణ చేపడుతున్నామన్నారు.


లింగంపేటలో..

లింగంపేట(ఎల్లారెడ్డి): ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని పురస్కరించుకుని సోమవారం నిర్వహించే శోభాయాత్రలో ప్రతిఒక్కరూ పాల్గొని సక్సెస్ చేయాలని ఛత్రపతి శివాజీ సేన సభ్యులు కోరారు. సోమవారం ఉదయం 10 గంటల నుంచి స్థానిక రామాలయం నుంచి గ్రామంలో శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

దోమకొండలో..

దోమకొండ : మండల కేంద్రంలో సోమవారం సాయంత్రం ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా ర్యాలీ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బాపురెడ్డి తెలిపారు. సాయంత్రం 4 గంటలకు స్థానిక ఛత్రపతి శివాజీ విగ్రహం వద్ద నుంచి గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించనున్నట్లు ఆయన వివరించారు.

'లీకేజీని అరికట్టాలి'



సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని పాత పోస్టాఫీస్ వద్ద మిషన్‌భగీరథ గైట్‌వాల్ ధ్వంసం కావడంతో నీరుగత రెండు రోజులుగా లీకేజీ అవుతుంది. లీకేజీ నీరు రోడ్డుపై పారుతుండడంతో రోడ్డు వెంబడి వెళ్లే వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు.

గీత వృత్తికి మార్కెట్ సౌకర్యం కల్పించాలి



మాట్లాడుతున్న కల్లుగీత కార్మిక సంఘం నాయకులు

కామారెడ్డి టౌన్ : కల్లు గీత వృత్తికి ప్రభుత్వం మార్కెట్ సౌకర్యం కల్పించాలని కల్లు గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకట్‌గౌడ్ డిమాండ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో కల్లుగీత వృత్తిపై రూ. 5 లక్షల కుటుంబాలు ఆధారపడి ఉన్నాయన్నారు. ఈత తాటి చెట్ల పెంపకానికి ప్రతి గ్రామానికి 5 ఎకరాల భూమి కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు సాయాగౌడ్, నారాగౌడ్, శంకర్ గౌడ్, రవిగౌడ్, బస్వాగౌడ్ తదితరులున్నారు.

గ్రామాల్లో పందుల స్వైరవిహారం



తాడ్వాయి మండల కేంద్రంలో తిరుగుతున్న పందులు

ఇబ్బందుల్లో ప్రజలు

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో ఊర పందులు హంగామా చేస్తున్నాయి. పందులు గుంపులు–గుంపులుగా వీధుల్లో తిరుగుతున్నాయి. ఇళ్ల పరిసరాల్లో తిరుగుతూ ఇంటి ముందర ఉన్న సామగ్రిని చిందరవందర చేస్తున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డ్రైనేజీలలో ఉన్న మురికిని తీసుకొచ్చి వాకిళ్లలో పడేస్తున్నాయని, ఇంటి పరసరాల్లో మొక్కలను తొలగిస్తున్నాయని వాపోతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. తాడ్వాయి, కృష్ణాజివాడి, దేమికలాన్, ఎర్రాపహాడ్ తదితర గ్రామాల్లో పందులు అధికంగా తిరుగుతున్నాయని వాటి నుంచి పరిష్కారం చూపాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బీమా చెక్కు అందజేత



చెక్కును అందజేసిన పోస్టల్ సిబ్బంది

దోమకొండ : మండలంలోని సంఘమేశ్వర్‌కు చెందిన కరికే స్వామి ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందగా వారి కుటుంబానికి రూ. 10 లక్షల ప్రమాద బీమా చెక్కును అందజేసినట్లు దోమకొండ సబ్ పోస్టుమాస్టర్ సంతోష్‌కుమార్ తెలిపారు. మృతుడు స్వామి పోస్టాఫీస్‌లో టాటా ఏఐజీ ప్రమాద బీమా రూ.399 చెల్లించినట్లు తెలిపారు. పాలసీదారుడు యాక్సిడెంట్‌లో మరణించగా, నామినీ భార్య కరికే మంజులకు రూ. 10 లక్షల ప్రమాద బీమా చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ డివిజన్ ఎస్ఎస్‌పీవో జనార్దన్ రెడ్డి, తపాలా శాఖ కామారెడ్డి ఏఎస్పీ భూమన్న, సబ్ డివిజన్ మేనేజర్ పవన్‌రెడ్డి, ఉమ్మడి దోమకొండ మండల పోస్టాఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బోర్‌మోటర్ ప్రారంభం



బోర్ మోటార్‌ను ప్రారంభిస్తున్న ఎంపీపీ

భిక్కనూరు : మండలంలోని మల్లుపల్లి ప్రభుత్వ స్కూల్‌లో బోర్ మోటారును ఎంపీపీ గాలిరెడ్డి ఆదివారం ప్రారంభించారు. పాఠశాలలో నీటి ఎద్దడి ఉన్న విషయాన్ని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి బోర్ మోటర్‌ను మంజూరు చేయించారన్నారు. పీసీసీ కార్యదర్శి ఇంద్రకరన్‌రెడ్డి,కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రకాంత్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుదర్శన్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు కుంట లింగారెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీంరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు మోహన్‌రెడ్డి, నాయకులు సిద్దిరెడ్డి, వెంకట్‌రెడ్డి, నర్సింలు,తదితరులు పాల్గొన్నారు.

దర్జాగా చోరీ సొత్తు అమ్మకాలు

- బంగారం, ఇతర వస్తువులను అమ్ముతున్న నిందితులు
- బిచ్కుందలో కొనుగోలు చేసిన వ్యక్తిని పట్టుకున్న పోలీసులు

బిచ్కుంద(జుక్కల్) : ఆయా ప్రాంతాల్లోని ఇళ్లల్లో ఇతర ప్రదేశాల్లో చోరీ చేసిన అనంతరం దొంగలు బిచ్కుంద మార్కెట్‌లో తీసుకొచ్చి దర్జాగా విక్రయిస్తున్నారు. మహారాష్ట్ర, కర్నాటక, నిజాంపేట్, నారాయణ్‌ఖేడ్, బోధన్ ఆయా ప్రాంతాల్లో దొంగలు దోచుకున్న వస్తువులను దొంగలకు విక్రయించడానికి బిచ్కుంద కేరాఫ్ అడ్రగా మారింది. నెల రోజుల క్రితం నిజాంపేట్ శివారులో ఓ రైతు పొలంలో ట్రాక్టర్ కేజీవిల్ దుక్కులు వేసి పొలంలోనే వదిలేశాడు. దొంగలు కేజీవీల్‌లను దొంగలించారు. నిజాంపేట్ పోలీస్ స్టేషన్‌లో కేసునమోదు చేసి పోలీసులు దొంగలను పట్టుకున్నారు. వారిని విచారించగా బిచ్కుందలోని బాన్సువాడ రోడ్డులో ఉన్న పాత వస్తువులు కొనుగోలు షాపులో విక్రయించానని ఒప్పుకున్నారు. దీంతో వారం రోజుల క్రితం నిజాంపేట్ పోలీసులు బిచ్కుందలో దొంగ వస్తువులు కొనుగోలు చేసిన దుకాణ యజమానికి పట్టుకొని రికవరీ చేసి ఆయనపై కేసు నమోదు చేశారు. దొంగ వస్తువులు కొనుగోలు చేయడం నేరమని తెలిసినప్పటికీ కొందరు వ్యాపారులు తక్కువకే వస్తున్నాయనే ఆశతో చోరీ సొత్తును కొనుగోలు చేస్తున్నారు. గతంలో చాలాసార్లు దొంగలు చోరీ చేసిన బంగారం, వెండి ఆభరణాలు తక్కువ ధరతో బిచ్కుంద గోల్డ్ షాపుల్లో విక్రయించారు. మహారాష్ట్ర, కర్ణాటక ఇరత జిల్లాల పోలీసులు బిచ్కుందలో గోల్డ్ షాపులపై దాడిచేసి దొంగ బంగారం, వెండి పట్టుకొని రికవరీ కేసుల ఘటనలు ఎన్నో ఉన్నాయి.

కేరాఫ్ అడ్రస్‌గా..

బిచ్కుంద మండల కేంద్రంలో గోల్డ్ షాపులు అనేకమున్నాయి. దొంగలు తాము చోరీ చేసిన సొత్తును నేరుగా బిచ్కుంద మార్కెట్‌కే తీసుకొస్తున్నారు. ఎక్కడైనా దొంగలు దోచుకున్న వస్తువులు బిచ్కుందలో అమ్ముతారని మహారాష్ట్ర, కర్ణాటక, ఇతర జిల్లాల పోలీసులకు పక్కా సమాచారం ఉండడంతో బిచ్కుంద వైపు దృష్టి పెట్టి సొమ్ములను రికవరీ చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా చోరీ చేసిన వస్తువులను కొనుగోలు చేయడం మాత్రం ఆగడం లేదు.

సంక్షిప్తం

యువకుడికి పరామర్శ



నిజాంసాగర్(జుక్కల్) : మహమ్మద్ నగర్ మండల కేంద్రానికి చెందిన నిరుపేద యువకుడు ఉదయ్‌గౌడ్‌ను ఆదివారం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పరామర్శించారు. రోడ్డు ప్రమాదానికి గురై కాళ్లు విరిగి ఇంటికే పరిమితమైన నిరుపేద యువకుడికి ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అండగా ఉంటారని ధైర్యం చెప్పారు. పరామర్శించిన వారిలో మండల కాంగ్రెస్ నాయకులు జయప్రదీప్, రవీంద్‌రెడ్డి, రమేశ్ యాదవ్ తదితరులున్నారు.

వాహనాల తనిఖీ

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని కామారెడ్డి–ఎల్లారెడ్డి ప్రధాన రహదారిలో ఆదివారం పోలీసుల ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు. లైసెన్స్‌లు, పోలీస్, వాహనాలకు సంబంధించిన ధృవీకరణ పత్రాలతో పాటు సీటు బెల్ట్‌లు, హెల్మెట్లు ధరించని వారికి జరిమానా విధించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో ఏఎస్సై సంజీవులు, కానిస్టేబులు, హోంగార్డులు పాల్గొన్నారు.

ఆలయాభివృద్ధికి విరాళం

మాచారెడ్డి : మండలంలోని చుక్కాపూర్ శ్రీ లక్ష్మీ నరసింహాస్వామి ఆలయ అభివృద్ధి కోసం హైదరాబాద్కు చెందిన కాసుల మధు, సరిత దంపతులు ఆదివారం రు.5,100లు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ సిబ్బంది ఆ దంపతులకు స్వామి వారి చిత్రపటాన్నిబహూకరించారు.

తహసీల్దార్‌గా గంగాసాగర్

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మండల తహసీల్దార్‌గా గంగాసాగర్ బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన హి మబిందు జుక్కల్ మండలానికి బదిలీ చేశారు. జుక్కల్‌లో తహసీల్దార్‌గా పని చేసిన గంగాసాగర్ సదాశివనగర్‌కు వచ్చారు. గంగాసాగర్ సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నారు.